సాక్షి పల్నాడు

బుధవారం | 17 | జూలై | 2024



ఎల్లమ్మతల్లి బోనాల ఉత్సవం

వెల్దుర్తి: గుండ్లపాడులో వేంచేసియున్న ఎల్లమ్మ తల్లికి మంగళవారం ఘనంగా బోనాలు సమర్పించారు. ప్రతి ఏడాది ఆషాఢమాసంలో బోనాలు సమర్పించటం ఆనవాయితీ



అమ్మవారికి ఆషాఢ సారె

నరసరావుపేట ఈస్ట్: పాతూరులోని గంగా పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారికి మహిళలు మంగళవారం ఆషాఢ సారె సమర్పించారు.



నేడు ఏకలవ్య జయంతి

చిలకలూరిపేట: పట్టణంలో బుధవారం జరగనున్న ఏకలవ్య జయంతిని విజయవంతం చేయాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ కోరారు.

న్యూస్‌రీల్

నేడు సాగర్ కుడి కాలువకు నీటి విడుదల



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువకు బుధవారం తాగునీటి అవసరాల నిమిత్తం ఉదయం 10గంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు మాచర్ల ఓఅండ్‌ఎం ఈఈ శ్రీహరి మంగళవారం తెలిపారు. కుడికాలువ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు ఈ నీటి విడుదల కొనసాగుతుందన్నారు. కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ ఆదేశాల మేరకు మొత్తం 4.5టీఎంసీల నీరు రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున 9 రోజుల పాటు విడుదల చేయనున్నట్లు ఈఈ తెలిపారు.

రేపటి నుంచి 'టీచ్ టూల్' తరగతులు

డీఈఓ ఎం.వెంకటేశ్వర్లు



నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా పరిధిలోని ఉపాధ్యాయులకు ఈనెల 18వతేదీ నుంచి 27 వరకు తొమ్మిది రోజుల పాటు టీచ్ టూల్ మూడవ విడత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. శిక్షణ తరగతుల ఏర్పాట్లపై మంగళవారం మండల విద్యావనరుల కేంద్రంలో మాస్టర్ ట్రైనర్స్‌తో సమావేశం నిర్వహించారు. డీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, మాచర్ల కేంద్రాలలో తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని 411 మంది ఉపాధ్యాయులకు 21 మంది మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇస్తారని వివరించారు. నాలుగు కేంద్రాల కో–ఆర్డినేటర్లుగా నియమితులైన మండల విద్యాశాఖాధికారులు శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, శిక్షణను నాన్ రెసిడెన్షియల్ పద్ధతితో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శిక్షణకు హాజయ్యే ఉపాధ్యాయులకు అల్పాహారం, భోజన వసతితో పాటు మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. సమావేశంలో ఎంఈఓ ఎస్.నాగేశ్వరరావు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

రేపు జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సబ్ జూనియర్స్ బాల, బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 18న సాయంత్రం 4 గంటలకు సత్తెనపల్లి పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరుగుతాయని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఎంపిక పోటీలలో పాల్గొనదల్చిన క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, తల్లిదండ్రుల సమ్మతి పత్రం వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9701052588 సెల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ దూరవిద్య పీజీ పరీక్షలు వాయిదా

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 30 నుంచి జరగాల్సిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్య పీజీ పరీక్షలు వాయిదా పడినట్లు జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ స్టడీ సెంటర్ సమన్వయకర్త పి.గోపీచంద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ ద్వితీయ పరీక్షలు ఆగస్టు 20 నుంచి 25 వరకు, పీజీ ప్రథమ సంవత్సర పరీక్షలు సెప్టెంబర్ 20 నుంచి 24 వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్ష ఫీజు ఎటువంటి అపరాధ రుసుం ఈనెల 22లోపు చెల్లించాలని సూచించారు. రూ.500 అపరాధ రుసుంతో ఈనెల 29, రూ.వెయ్యి అపరాధ రుసుంతో ఆగస్టు 3వ తేదీ వరకు చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు. వర్సిటీ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఏపీ ఆన్‌లైన్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు 0863–2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 503.00 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 813.10 అడుగుల వద్ద ఉంది.

సాగు తీరు మార్చినారు

- నారు కోసం నర్సరీలను ఆశ్రయిస్తున్న రైతన్నలు
- సమయంతో పాటు ఖర్చు ఆదా
- నారుకు ప్రత్యామ్నాయంగా అందుబాటులో మొక్కలు సైతం..
- పల్నాడు జిల్లాలో 550 ఎకరాలకు ఫైగా నర్సరీలు

పంటల సాగులో నూతన విధానం



గురజాలలోని ఓ నర్సరీలో సిద్ధంగా ఉన్న నారు

గురజాల: గతంలో రైతులు కూరగాయలు, ఆకు కూరలను పండించేందుకు కావల్సిన విత్తనాలు, నారును వారే స్వయంగా తయారు చేసుకునేవారు. అందుకు గాను కొంత సమయం, భూమిని వెచ్చించాల్సి వచ్చేది. ఒకరికొకరు సహాయం చేసుకుంటూ లాభాలు పొందేవారు. ప్రస్తుతం రైతులు తీరు మార్చి నూతన విధానాలను అవలంభిస్తున్నారు. నారు కోసం నర్సరీల బాట పడుతున్నారు. దీని వలన సమయంతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుంది.

రెడీమేడ్ మొక్కల వైపు చూపు

గతంలో వంగ, టమాట, మిరప వంటి పంటలు సాగుచేయాలంటే రైతులు ముందస్తు ఏర్పాట్లు చేసుకునేవారు. పొలంలోనే వారికి కావల్సిన నారు కోసం కొంత విస్తీర్ణంలో భూమిని చదును చేసి ఎరువు వేసి విత్తనం చల్లేవారు. అవి మొక్కలయ్యాక వాటిని పొలాల్లో నాటేవారు. ఈ పనుల కోసం దాదాపు 30–40 రోజులు సమయం పట్టేది. అయితే మిరప, టమాట, వంగ వంటివాటి సాగు విస్తీర్ణం పెరగడం.. తక్కువ సమయంలో పంట దిగుబడి రావాలని కోరుకోవడం.. ఏడాదికి మూడు పంటలు సాగు చేసేలా రైతులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడంతో నారుకు ప్రత్యామ్నాయంగా రెడీమేడ్‌గా మొక్కలు సరఫరా చేసే నర్సరీలు అందుబాటులోకి రావడంతో రైతులు వాటివైపు మొగ్గు చూపుతున్నారు.

ప్రతి మండలంలో నర్సరీలు..

గతంలో పల్నాడు ప్రాంతంలో రెంటచింతలలో మాత్రమే నర్సరీలు ఉండేవి. కానీ నేడు ప్రతి మండలంలో నర్సరీలు పదుల సంఖ్యలో ఏర్పాటయ్యాయి. నర్సరీలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అధికంగా ఉండటం వలన రైతులు వాటిని ఏర్పాటు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. ఈ నర్సరీల్లో మొక్కలను బట్టి ధర నిర్ణయం ఉంటుంది. రైతులు తమ వద్ద ఉన్న విత్తనాలు నర్సరీ యజమానులకు ఇచ్చి ట్రేలలో నారు పెంచడం ఒక పద్ధతి.. అందుకు గాను మొక్కకు ఇంత అని ఇస్తుంటారు. నర్సరీ యజమానే విత్తనాలు తీసుకువచ్చి ట్రేలలో నారు పెంచి అమ్మడం మరొక పద్ధతి. ఈ పద్ధతిలో మొక్కను బట్టి ధర ఉంటుంది. ఒక్కో రకం మొక్క రూ.2 నుంచి రూ.1.50 వరకు ధర పలుకుంది.

తేజలకు గిరాకీ..

పల్నాడు ప్రాంతంలోని నర్సరీల్లో అత్యధికంగా తేజలకు గిరాకీ ఉన్నట్లు నర్సరీ నిర్వాహకులు అంటున్నారు. మిరపలో తేజ రకం, వంగ, టమాట మొక్కలు ఎక్కువగా రైతులు అడుగుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

కూలీలకు ఉపాధి

నర్సరీలతో కూలీలకు నిత్యం ఉపాధి దొరుకుతుంది. ఒక్కో నర్సరీలో సుమారుగా 10 మందికి పైగా కూలీలు అవసరం. దీంతో ఒక్కో నర్సరీ 10 కుటుంబాలకు ఉపాధి కల్పించే సాధనంగా మారింది. నర్సరీల్లో నిత్యం ఏదో ఒక పని ఉంటుందని పలువురు కూలీలు అంటున్నారు.

జిల్లావ్యాప్తంగా 150 నర్సరీలు


పల్నాడు జిల్లాలోని గురజాల, మాచర్ల, సత్తెనపల్లి, పెదకూరపాడు, నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో మొత్తం సుమారుగా 550 ఎకరాల విస్తీర్ణంలో 150 నర్సరీలు ఉన్నట్లు ఉద్యానశాఖాధికారులు చెబుతున్నారు. మూడు రకాల నర్సరీలు ఉన్నాయని, వాటిలో రకాలను బట్టి సబ్సిడీ అందించడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. నర్సరీలో ఎకరానికి సుమారుగా 14వేల నుంచి 15వేల వరకు మొక్కలు వస్తాయి.



నర్సరీలో విత్తనాలు వేసి సిద్ధం చేసిన ట్రేలు

నేడు వినుకొండ తిరునాళ్ల

లక్షమందికి ఫైగా తరలిరానున్న భక్తులు



కొండపైన ఏర్పాటు చేసిన అఖండజ్యోతి

వినుకొండ(నూజెండ్ల): తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వినుకొండ కొండపై కొలువైన శ్రీరామ లింగేశ్వరస్వామి తిరునాళ్ల బుధవారం అత్యంత వైభవంగా జరగనుంది. దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. కొండమెట్ల మార్గం శుభ్రం చేయడంతో పాటు, చిన్నకొండపై దేవాలయాల వద్ద మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య పనులు చేయించారు. తిరునాళ్ల సందర్భంగా లక్షమందికిపైగా భక్తులు తరలిరానుండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏడాదిలో తొలి పండుగ కావటంతో తిరునాళ్లను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

కొండపైకి ప్రత్యేక బస్సులు..

ఘాట్‌రోడ్డు ద్వారా కొండపైకి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసింది. వినుకొండ డిపోనుంచి 30 ప్రత్యేక బస్సులను కొండపైకి నడుపుతున్నట్లు ఆర్టీసీ మేనేజర్ కోటేశ్వరరావునాయక్ తెలిపారు.

వైభవంగా అఖండజ్యోతి ఏర్పాట్లు:

ఆధ్యాత్మిక బాబా హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో అఖండజ్యోతి వెలిగించేందుకు ఏర్పాట్లు చేశారు. 1000 కిలోల ఆవునేతితో అఖండజ్యోతి వెలిగించనున్నారు.



రామలింగేశ్వరుని మూలవిరాట్ (ఫైల్)

తిరునాళ్లకు ప్రత్యేక ఏర్పాట్లు..

తిరునాళ్ల సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలుగకుండా పలు సేవాసంస్థలు, రాజకీయ పార్టీల నాయకులతోపాటు దేవదాయశాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కొండపైన భక్తులకు అన్నదానం, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. ఆర్‌ఎంపీ గ్రామీణ వైద్యుల ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే పట్టణంలో సాంఘిక నాటకాలు, పాటల కచేరీలు, కోలాటం భజనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.


పటిష్ట బందోబస్తు..

తిరునాళ్ల సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు సీఐలు, 8 మంది ఎస్‌ఐలు 150 మంది పోలీసులతో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు పట్టణ సీఐ సాంబశివరావు తెలిపారు.

జిల్లావ్యాప్తంగా 14 కౌంటర్లు

నరసరావుపేట: బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న నిత్యావసర ధరలను అదుపులో ఉంచేందుకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆరు పట్టణాల్లో 14 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ జిల్లా అధికారి ఎస్.పద్మశ్రీ మంగళవారం పేర్కొన్నారు. చిలకలూరిపేటలోని రైతుబజారు, స్పెన్సర్స్, నరసరావుపేటలోని రిలయన్స్, పల్నాడు బస్టాండ్ దగ్గర ఉన్న రిలయన్స్ స్మార్ట్, శివునిబొమ్మ సెంటర్, పిడుగురాళ్ల రిలయన్స్, ఆర్యవైశ్య కల్యాణ మండపం, వినుకొండ రిలయన్స్ స్మార్ట్, రిలయన్స్ రిటైల్, ఆరెంజ్ సూపర్ మార్కెట్, వెన్నెల సూపర్ మార్కెట్, ఎండీఓ కార్యాలయం, మాచర్ల అర్బన్‌లోని రామాలయం, దుర్గిలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు వద్ద కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఫైన్‌రకం బియ్యం కిలో రూ.49, ముడి రా రైస్ కిలో రూ.48, దేశవాళీ కందిపప్పు రూ.160లకు విక్రయించటం జరుగుతుందన్నారు. ఈనెల 11 నుంచి విక్రయాలు ప్రారంభం కాగా ఇప్పటివరకు 1693 మందికి 1806 కిలోల కందిపప్పు, 386 మందికి 5138 కిలోల బియ్యం విక్రయించటం జరిగిందన్నారు.

ఏకాదశికి కోటప్పకొండ ముస్తాబు



నరసరావుపేట రూరల్: తొలి ఏకాదశి పర్వదినానికి కోటప్పకొండ ముస్తాబయింది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి తొలి ఏకాదశి రోజున త్రికోటేశ్వరుణ్ణి దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. దాదాపు 20వేల మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెల్లవారుజామున ఐదు గంటల నుంచి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మూలవిరాట్ అభిషేకాలను ఆలయంలో నిలిపివేశారు. ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం(రూ.100), అభిషేక దర్శనాన్ని భక్తులకు కల్పించేందుకు వీలుగా ప్రత్యేక క్యూలైన్‌లు సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణంలో షామియానాలు ఏర్పాటుచేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు పేలపిండి ప్రసాదాన్ని అందిస్తున్నట్టు ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. నరసరావుపేట, చిలకలూరిపేటల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనుంది. ఘాట్‌రోడ్డుతో పాటు కొండపైన వాహనాల రద్దీని నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం కోటప్పకొండలో పర్యటించి ఏర్పాట్లు పరిశీలించారు.

సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- జిల్లాస్థాయి అధికారులతో తొలి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లాలోని వివిధ శాఖల అధికారులంతా సమన్వయంతో బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో తొలిసారిగా జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తక్షణ ప్రాధాన్యత కలిగిన పలు అంశాలు, శాఖల వారీగా లక్ష్యాలు నిర్దేశించారు. రెవెన్యూ శాఖ పరంగా తహసీల్దార్లు కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు సుమోటో వెరిఫికేషన్ జూలై 18 నాటికి పూర్తి చేయాలని సూచించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులపై నిబంధనల ప్రకారం పరిష్కారం చూపాలని, తహసీల్దార్లు చౌక ధరల దుకాణాలు, ఎంఎల్‌ఎస్ పాయింట్లలో తరచుగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఇసుక విధానంలో మైనింగ్ శాఖ తరపున జిల్లాలో ఇసుక తవ్వకాల కోసం అవసరమైన పర్యావరణ అనుమతులు వెంటనే పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఇసుక కొరత రాకుండా చూడాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా పారిశుద్ధ్యం మెరుగుపడాల్సిన అవసరం ఉందని, పట్టణాలలో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో స్వయంగా మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలన్నారు. పంచాయతీల్లో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డేని గురు, శుక్ర రెండు రోజులూ నిర్వహించాలన్నారు. ఎంపీడీఓలు సైతం మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీలు చేయాలని, వారానికి కనీసం ఒక పాఠశాల, ఒక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలన్నారు. వచ్చే నెల ఒకటో తేదీన ప్రతి గ్రామంలో ఉదయం 5 గంటలకే తొలి పింఛన్ పంపిణీ జరగాలని, మొదటి రోజే వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తికావాలని ఆదేశించారు. నాగార్జునసాగర్ నుంచి తాగునీటికి వదిలిన నీటిని కేవలం తాగునీటికి మాత్రమే వాడేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఖరీఫ్ సాగుకోసం సాగర్ నీటి లభ్యత, ఇప్పటివరకూ నమోదైన వర్షపాతాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ ప్రణాళిక అమలు చేయాలని వ్యవసాయాధికారులకు సూచించారు. మండల ప్రత్యేక ఆఫీసర్లు ప్రతి శుక్రవారం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. డీఆర్‌ఓ కె.వినాయకం పాల్గొన్నారు.

ఎఫ్‌ఎఫ్‌పీఓలను బలోపేతం చేస్తాం

మత్స్యశాఖ జిల్లా అధికారి సంజీవరావు

నరసరావుపేట: ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన ద్వారా జాతీయ సహకార అభివృద్ధి సంస్థ సహకారంతో చేపల రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యలు(ఎఫ్‌ఎఫ్‌పీఓ)గా రూపాంతరం చేసి తద్వారా వ్యాపార కార్యకలాపాలను బలోపేతం చేస్తామని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.సంజీవరావు స్పష్టంచేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో జిల్లా పరిధిలోని ఆరు మత్స్య సహకార సంఘాల ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్స్య సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ఎఫ్‌ఎఫ్‌పీఓల వ్యాపార కార్యకలాపాలను విస్తృత పరుస్తామన్నారు. జిల్లా కో–ఆపరేటివ్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ సహకార పుస్తకాలను సమయానికి ఆడిట్ చేయాలన్నారు. మేనేజ్‌మెంట్ గ్రాంట్, ఈక్విటీ గ్రాంట్లను పొందేందుకు సమర్పించాల్సిన సంఘ తీర్మానాలు, సంఘాలు నిర్వహించే వ్యాపారాలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కల్పించారు. అధికారులు జి.భాగ్యలత, మత్స్య సహాయకులు, సహకార సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి కుష్ఠు సర్వే

పోస్టర్ ఆవిష్కరించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి, కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ మురళీకృష్ణ

నరసరావుపేట: జిలాలో కుష్ఠు నివారణ కోసం అనుమానితుల, వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం ఈనెల 18 నుంచి ఆగస్టు రెండో తేదీవరకు జరుగుతుందని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. దీనికి సంబంధించి మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఆశా కార్యకర్త, మేల్ స్వచ్ఛంద కార్యకర్త ఒక టీమ్‌లా వచ్చి సర్వే చేస్తారన్నారు. ఇళ్లవద్దకు వచ్చిన వీరికి ప్రజలు రాగి రంగు, పాలిపోయిన మొద్దు బారిన మచ్చలు, కాళ్లు, చేతులు వంకర్లు పోయి వస్తువులను పట్టుకోలేకపోయిన స్థితి, చెవులు, శరీరం మీద ఉన్న బొబ్బలు, ముఖం నూనె రాసినట్లు ఉన్నా, కళ్లు మూతపడకపోయిన పరిస్థితులు ఉంటే తెలియజేయాలని కోరారు. జిల్లా కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ కె. మురళీకృష్ణ మాట్లాడుతూ కుష్ఠు ప్రమాదకరం కాదని, చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. ఈ వ్యాధికి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స ఉచితంగా చేస్తారని అన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడు డీఈఓకు సరెండర్



పాఠశాలలో విచారణ చేస్తున్న డీవైఈఓ శాంతకుమారి, ఎంఈఓ లక్ష్మీనారాయణ

తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నాగేశ్వరరావుపై విద్యార్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకున్నారు. ఉపాధ్యాయుడిని డీఈఓకు సరెండర్ చేశారు. తెలుగు ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు పాఠాలు సరిగా చెప్పడం లేదని పలువురు విద్యార్థినులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు తెనాలి జిల్లా ఉప విద్యాధికారిణి శాంతకుమారి, మండల విద్యాశాఖ అధికారి మేకల లక్ష్మీనారాయణ పాఠశాలలో మంగళవారం విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడిని బదిలీ చేయాల్సిందేనని విద్యార్థినులు పట్టుబట్టారు. దీంతో స్పందించిన అధికారులు నాగేశ్వరరావును జిల్లా విద్యాశాఖధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులలో ఒకరిని తెలుగు బోధించేందుకు సర్దుబాటు చేశారు. విద్యార్థులు సమస్యను దృష్టికి తెచ్చిన వెంటనే సరిగా స్పందించని ప్రధానోపాధ్యాయురాలు సరళను మందలించారు.

గుంటూరు రేంజ్‌లో పది మంది సీఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో పది మంది సీఐలను బదిలీ చేస్తూ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎం.విజయచరణ్	సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్, పల్నాడు	నరసరావుపేట 1 టౌన్ పీఎస్
సిరిగిరి సాంబశివరావు	వినుకొండ టౌన్ పీఎస్	నరసరావుపేట 2 టౌన్ పీఎస్, పల్నాడు
యు.శోభన్‌బాబు	డీఎస్‌బీ-2, పల్నాడు జిల్లా	వినుకొండ టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా
పసుపులేటి రామకృష్ణ	వేమూరు సర్కిల్, బాపట్ల	నరసరావుపేట రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా
బలగాని ప్రభాకర్	తుళ్లూరు ట్రాఫిక్-2, గుంటూరు	వినుకొండ రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా
బి.సుబ్బనాయుడు	ఎస్సీ, ఎస్టీ సెల్, పల్నాడు	చిలకలూరిపేట రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా
కె.వెంకటప్రసాద్	డీఎస్‌బీ-3, గుంటూరు	అచ్చంపేట యూపీఎస్, పల్నాడు జిల్లా
ప్రత్తిపాటి సురేష్	రేంజ్ వీఆర్, గుంటూరు	పెదకూరపాడు సర్కిల్, పల్నాడు జిల్లా
ఎం.సుబ్రమణ్యం	రాపూర్ సర్కిల్, నెల్లూరు	సత్తెనపల్లి టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా
పోలూరి శ్రీనివాస్	సత్తెనపల్లి టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా	సత్తెనపల్లి రూరల్ పీఎస్, పల్నాడు జిల్లా

యార్డులో 36,277 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 37,622 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 36,277 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,500 నుంచి రూ.16,200 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.8,800 నుంచి రూ.18,000 వరకు లభించింది. తాలు రకం మిర్చి రూ.4,000 నుంచి రూ.12,000 వరకు పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 16,875 బస్తాలు మిర్చి నిల్వ ఉంది.

క్లుప్తంగా

గుంటూరు జిల్లాలో 11.1మి.మీటర్లు వర్షం

అత్యధికంగా మేడికొండూరులో 20.2 మి.మీ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు సగటున 11.1 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మేడికొండూరు మండలంలో 20.2 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా పెదనందిపాడు మండలంలో 1.6 వర్షం కురిసింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తాడికొండ మండలంలో 18.4 మి.మీ., గుంటూరు తూర్పు 16.2, కొల్లిపర 15.2, గుంటూరు పశ్చిమ 15, చేబ్రోలు 14.8, తుళ్లూరు 14.4, మంగళగిరి 13, ఫిరంగిపురం 11.2, పెదనందిపాడు 10.8, ప్రత్తిపాడు 9.4, వట్టిచెరుకూరు 8.8, దుగ్గిరాల 8.6, పొన్నూరు 7.8, తాడేపల్లి 6.4, తెనాలి 5.2, కాకుమాను మండలంలో 3.6 మి.మీ చొప్పున వర్షం కురిసింది.

20న దివ్యాంగులకు మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ఉపాధి కార్యాలయం, సమర్థనం సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20న దివ్యాంగుల కోసం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.రఘు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గోరంట్లలోని హోసన్నా మందిర్ ఎదుట సమర్థనం సంస్థలో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న మెగా జాబ్‌మేళాకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్ల లోపు యువత హాజరు కావాలని సూచించారు. నాలుగు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్న జాబ్‌మేళాలో అభ్యర్థుల అర్హతలు ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తామని, విద్యార్హతల రెజ్యూమ్, ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్హతల ధ్రువపత్రాలు తీసుకుని రావాలని సూచించారు. వివరాలకు 63648 67800, 63648 67801, 63648 67802 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

కారు ఢీకొని యువకుడు మృతి



మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మేడికొండూరు మండలం పేరేచర్ల యూనివర్సల్ కాలేజీ సమీపంలో మంగళవారం జరిగింది. మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతి మండలం పొందుగల గ్రామానికి చెందిన ఆరెకట్ల శివనాగేశ్వరరావు(26) ఉద్యోగ అవకాశాల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మార్కాపురం బయలుదేరాడు. మార్గమధ్యలో పేరేచర్ల యూనివర్సల్ కళాశాల సమీపంలో అతివేగంగా నరసరావుపేట నుంచి పేరేచర్ల వైపు వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. సంఘటనా స్థలంలోనే శివనాగేశ్వరరావు మృతి చెందాడు. సంఘటన గురించి మృతుని బంధువులకు తెలిపిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి మేడికొండూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకులు వేధింపులు ఆపాలి

- లేకుంటే కలెక్టరేట్, ఎమ్మెల్యేల గృహాలను ముట్టడిస్తాం
- రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తాం
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

నరసరావుపేట: తెలుగుదేశం నాయకులు స్కీం వర్కర్లు, అంగన్‌వాడీ, ఇతర ఉద్యోగులపై చేస్తున్న వేధింపులు ఆపకుంటే రాష్ట్రవ్యాప్త పోరాటం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పేర్కొన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కె.హనుమంతరెడ్డి అధ్యక్షత వహించారు. ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలను టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సెంటర్ల వద్దకు వెళ్లి రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కక్షపూరిత రాజకీయాలు వద్దని చెబుతున్నప్పటికీ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాల్సిన నాయకులు పక్షపాత ధోరణితో వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. వేధింపులపై ఇప్పటికే జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులకు విన్నవించామని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని యూనియన్ పెద్దలు కలిసిన నేపథ్యంలో కూడా స్కీం వర్కర్లకు న్యాయం చేస్తామని, కొంత సమయం ఇవ్వాలని హామీ ఇచ్చారన్నారు. స్కీం వర్కర్లను రాజీనామాలు చేయించి భయభ్రాంతులకు గురిచేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అవసరమైతే కలెక్టరేట్, ఎమ్మెల్యే ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే బలవంతంగా రాజీనామా చేయించిన అంగన్‌వాడీలను విధుల్లోకి తీసుకోవాలన్నారు. వారికి అన్యాయం జరిగితే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయ నాయక్, జిల్లా కోశాధికారి డి.శివకుమారి, జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు మల్లేశ్వరి, పెండ్యాల మహేష్, పేరుబోయిన వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ సిలార్ మసూద్, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు

చిలకలూరిపేట: కొత్త పెన్షన్ విధానంపై ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఎస్టీయూ కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్త పెన్షన్ విధానం అమలుకు చర్యలు చేపడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పీఆర్సీ కమిటీ చైర్మన్ రాజీనామా చేసిన నేపథ్యంలో కొత్త చైర్మన్‌ను నియమించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు చెల్లింపునకు తగు చర్యలు చేపట్టాలన్నారు. యాప్‌ల భారం తగ్గించి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. సంఘ రాష్ట్ర పూర్వ కార్యదర్శి పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ సమగ్రశిక్షలో పనిచేస్తున్న వారికి నేటికీ జీతాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. 20వేల మందికి పైగా ఉన్న సిబ్బంది కుటుంబాలు ఈ జీతాలపైనే ఆధారపడి ఉంటారన్న విషయాన్ని గుర్తించి ప్రభుత్వం వెంటనే జీతాలు అందించాలని కోరారు. సమావేశంలో సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, జిల్లా కౌన్సిలర్ షేక్ జమీర్‌బాషా, నాయకులు చావలి మల్లేశ్వరరావు, మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్ పాల్గొన్నారు.

వీపీ సౌత్ వైద్యశాలకు అత్యున్నత సేవల సర్టిఫికెట్



పర్యవేక్షణ అధికారుల నుంచి ప్రశంసలు అందుకుంటున్న హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది

మాచర్ల రూరల్: మండల పరిధిలోని విజయపురి సౌత్ ప్రభుత్వ వైద్యశాలకు జాతీయ హామీ ప్రమాణాల పర్యవేక్షణ సంస్థ నుంచి అత్యున్నత సేవల సర్టిఫికెట్ వచ్చినట్లు డాక్టర్ ఓరుగంటి ప్రవీణ్ తెలిపారు. ఈ నెల 3వ తేదీన జాతీయ నాణ్యత ప్రమాణాల టీం కన్వీనర్ డాక్టర్ ఎంఏ అనూఫ్ నేతృత్వంలో జరిగిన వైద్యశాల పనితీరు తనిఖీలలో వారు సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. మంగళవారం నేషనల్ హెల్త్ రీసోర్స్ సెంటర్ నుంచి జాతీయ స్థాయిలో విజయపురి సౌత్ వైద్యశాలకు సర్టిఫికెట్‌ను అందించినట్లు పేర్కొన్నారు.

జాతీయ స్థాయిలో జరిగిన అసైన్‌మెంట్ 92.28 శాతంతో సర్టిఫికెట్ అందజేశారన్నారు. వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో అత్యున్నత సేవలందిస్తున్న జిల్లా వైద్యాధికారి రంగారావు వైద్యులు ప్రవీణ్, ముక్తీయార్, జాని, సూపరింటెండెంట్లు చారి, పద్మావతి, సంధ్యాకుమారి, సుజాతలను అభినందించారు.

● గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలి

బాపట్ల: గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని నల్లమడ రైతు సంఘం నాయకుడు డాక్టరు కొల్లా రాజమోహనరావు కోరారు. బాపట్ల మండలంలోని చెరువు జమ్ములపాలెంలోని రామాలయంలో మంగళవారం రైతుల సమావేశం నిర్వహించారు. వెంకట కమలాకరరావు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లాపై వెస్ట్ గోదావరి ఆధిక్యం



సాయిరామ్ చరణ్ రాజు, వెస్ట్ గోదావరి (6వికెట్లు)



6.4 ఓవర్లలో 4 వికెట్లు తీసిన సురేష్

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో గల ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న అండర్ -16 మల్టీ డే ఇంటర్ జోనల్ పోటీల్లో భాగంగా మంగళవారం వెస్ట్ గోదావరి, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. టాస్ గెలిచిన వెస్ట్ గోదావరి జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 47.4 ఓవర్లలో 141 పరుగులకు ఆల్ ఔట్ అయ్యింది. వెస్ట్ గోదావరి బౌలర్ సాయి రామ్‌చరణ్ రాజు చెలరేగిపోయి 20 ఓవర్లలో 48 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ సురేష్ 6.4 ఓవర్లలో 17 పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లు తీసి కర్నూలు జట్టును అదుపుచేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు 35 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 59 పరుగులు మాత్రమే చేసింది. మూడవ రోజు వెస్ట్ గోదావరి జట్టు కర్నూలు జట్టుపై 82 పరుగులు వెనుకబడి ఉంది.

డయేరియాతో మరో వ్యక్తి మృతి

పిడుగురాళ్లలో ఏడుకు చేరిన డయేరియా మృతుల సంఖ్య



ఆంజనేయులు (ఫైల్)

పిడుగురాళ్ల: డయేరియాతో మరో వ్యక్తి మృతి చెందాడు. పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్‌నగర్‌కు చెందిన ఓర్సు ఆంజనేయులు (60) వారం రోజుల క్రితం వాంతులు, విరేచనాలతో పట్టణంలోని మారుతి నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో చేరాడు. డయేరియా అదుపు కాకపోవడంతో మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ప్రభుత్వ హాస్పటల్‌కు తరలించారు. అక్కడ రెండు రోజులు వైద్య చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ఐదు రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆంజనేయులు మృతితో డయేరియా మృతుల సంఖ్య ఏడుకు చేరింది. ప్రభుత్వ వైద్య సిబ్బంది, మున్సిపల్ అధికారులు పట్టణంలో డయేరియా అదుపులో ఉందని చెప్పడం మాటలకే పరిమితం అయిందని, చేతల్లో మాత్రం సాధ్యం కావడంలేదనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు, ప్రభుత్వ వైద్యాధికారులు పూర్తిస్థాయిలో మెరుగైన పారిశుద్ధ్య పనులు, వైద్యసేవలు చేపట్టకపోతే మరణాలు పెరిగే అవకాశం ఉందని, తక్షణమే చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పటిష్ట స్థితిలో కడప జట్టు

- తొలి ఇన్నింగ్స్‌లో 255 పరుగులకు ఆలౌట్
- చిత్తూరు బౌలర్ సోహన్‌రెడ్డికి 6 వికెట్లు
- నేడూ కొనసాగనున్న మ్యాచ్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-16 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో భాగంగా మంగళవారం జరిగిన వైఎస్సార్ కడప-చిత్తూరు జట్ల మ్యాచ్‌లో కడప జట్టు పటిష్ట స్థితికి చేరుకొంది. వర్షం కారణంగా తొలిరోజు ఆట రద్దు కాగా రెండవరోజు సైతం పలు మార్లు అంతరాయం చోటు చేసుకొంది. ఓవర్‌నైట్ స్కోర్ 35 పరుగులతో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కడప జట్టు 255 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని జి.గైబు 69, జి.వి. సాయిసాకేత్ 49 పరుగులు సాధించారు. చిత్తూరు బౌలర్ సోహన్‌రెడ్డి 23.2 ఓవర్లలో 56 పరుగులు ఇచ్చి 6 వికెట్లు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మంగళవారం ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 9 పరుగులు సాధించింది. వర్షం కారణంగా తొలిరోజు ఆట రద్దు కావటంతో బుధవారం కూడా మ్యాచ్ కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

లక్ష్మీపురం: జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి కొత్తగా ఎన్నికైన కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. 50 గ్రామాలకు సాగునీరు, తాగునీరు సమస్యను పరిష్కరించే ఛానల్ పొడిగింపుకు నిధులు కేటాయించాలన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్‌ను పూర్తి చేసి 25వేల ఎకరాలకు నీరు అందించాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో 50 ఏళ్లుగా సుమారు 22వేల పేదకుటుంబాలు ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్నాయని చెప్పారు. రాజధాని సీడ్ యాక్సిస్ రోడ్డుకు భూములిచ్చిన రైతులకు ప్యాకేజిని పెంచాలని, రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు కౌలు చెల్లించే కాలపరిమితిని పెంచాలన్నారు. వ్యవసాయ కార్మికులు, ఇతర పేదలకు నెలకు 6వేలు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. కౌలు రైతులకు యాజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, అందుబాటులో ఉంచాలన్నారు. గుంటూరు ఛానల్, కొండవీటి వాగు, నల్లమడ, మేకల వాగు ఇతర పంట కాల్వల్లో తూటుకాడ, గుర్రపు డెక్క, ఇతర కంపచెట్లు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డువచ్చి పంటలు మునిగిపోతున్నాయని వెంటనే నిధులు కేటాయించి కాల్వలు మరమ్మతు చేయాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్ వర్కర్స్ వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ఈమని అప్పారావు, కె.నళినికాంత్, కె.అజయ్‌కుమార్, బెర్రగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్యమూర్తి కార్మెల్‌మాత



కొండపై మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



కార్మెల్‌మాత స్వరూపంతో ప్రదక్షిణ చేస్తున్న గురువులు

ఫిరంగిపురం: కారుణ్యమూర్తి కార్మెల్‌మాత అని పలువురు గురువులు చెప్పారు. కార్మెల్ కొండపై జరుగుతున్న ఉత్సవాలు మంగళవారం మూడోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా జరిగిన సమష్టి దివ్యపూజాబలి కార్యక్రమంలో ప్రధాన యాజకుడు, నూతన అభిషిక్త గురువు కె.శౌరినిఖిల్ తేజ, గురువులు ప్రవీణ్‌కుమార్, చొప్పరకిషోర్‌బాబు పాల్గొన్నారు. కార్మెల్‌మాత అవతరణ విశేషాలను వివరించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తేరుపై కార్మెల్‌మాత స్వరూపాన్ని ఉంచి గుడిచుట్టూ ప్రదక్షిణ చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దివ్యపూజాబలిలో పాల్గొన్నారు. అనంతరం కొండపై తలనీలాలు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి , కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మూడురోజులుగా ఏడుగురు సిబ్బంది ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. బాల ఏసుదేవాలయం సమీపంలోని పునీత అంథోనివారి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకుడు మున్నంగి జోజప్ప ప్రసాదాలు అందజేశారు.

తెలుగు ఉపాధ్యాయుడు డీఈఓకు సరెండర్



పాఠశాలలో విచారణ చేస్తున్న డీవైఈఓ శాంతకుమారి, ఎంఈఓ లక్ష్మీనారాయణ

తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నాగేశ్వరరావుపై విద్యార్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకున్నారు. ఉపాధ్యాయుడిని డీఈఓకు సరెండర్ చేశారు. తెలుగు ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు పాఠాలు సరిగా చెప్పడం లేదని పలువురు విద్యార్థినులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు తెనాలి జిల్లా ఉప విద్యాధికారిణి శాంతకుమారి, మండల విద్యాశాఖ అధికారి మేకల లక్ష్మీనారాయణ పాఠశాలలో మంగళవారం విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడిని బదిలీ చేయాల్సిందేనని విద్యార్థినులు పట్టుబట్టారు. దీంతో స్పందించిన అధికారులు నాగేశ్వరరావును జిల్లా విద్యా శాఖధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులలో ఒకరిని తెలుగు బోధించేందుకు సర్దుబాటు చేశారు. విద్యార్థులు సమస్యను దృష్టికి తెచ్చిన వెంటనే సరిగా స్పందించని ప్రధానోపాధ్యాయురాలు సరళను మందలించారు.

బడ్జెట్‌లో చేనేతలకు రూ.2వేల కోట్లు కేటాయించాలి

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో 2 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి బాలకృష్ణ మంగళవారం తాడేపల్లి రూరల్ కుంచనపల్లిలోని చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవితను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బాలకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ రంగం తరువాత చేనేత వృత్తికి ఎంతో ప్రాధాన్యం ఉందని, ప్రస్తుతం చేనేత పరిశ్రమ కార్పొరేట్ విధానాల వలన సంక్షోభంలో చిక్కుకుందని, తద్వారా చేనేత కార్మికులు ఆకలి చావులకు గురవుతున్నారని, అప్పులు తాళలేక ఆత్మహత్యలు చేసుకుని బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేనేతలపై జీఎస్టీ విధించడం వల్ల చేనేత రంగం కకావికమైందని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత కార్మికులను ఆదుకునేందుకు 2 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కోరారు. ప్రతి చేనేత కార్మికుడికీ మూడు సెంట్ల స్థలంలో షెడ్‌తో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని, పట్టు జరీ నూలును 2021 నాటి ధరలకు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. చేనేత వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని, తమ సంఘం డిమాండ్లపై మంత్రి సవిత సానుకూలంగా స్పందించారని వివరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టా శివదుర్గారావు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డోకిపర్తి రామారావు, కమిటీ సభ్యులు కౌతరపు వెంకటేశ్వరరావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలుచేయాలంటూ ప్రదర్శన



ఆందోళన నిర్వహిస్తున్న యూనియన్ నేతలు

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో ఓపీఎస్ కావాలని కోరుతూ మంగళవారం ఆందోళన నిర్వహించారు. జీపీఎస్ యాక్ట్‌నును తాత్కాలికంగా నిలిపివేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా మాట్లాడుతూ జీపీఎస్ యాక్ట్‌ను వెనక్కి తీసుకోవటం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చాలా మేలు చేసిందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు అందరూ ఓపీఎస్ పాత పెన్షన్ విధానం కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. సీపీఎస్, జీపీఎస్‌లకు ప్రభుత్వ ఉద్యోగులు అంగీకరించే పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. గత దశాబ్దకాలం నుండి ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ శాపంగా మారిందని వెల్లడించారు. గత ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేస్తామని చెప్పి ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. ఏ ప్రభుత్వం అయినా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేసి తీరాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లా షాఖాదరి, జిల్లా కోశాధికారి పోతురాజు, నగర శాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, పెద రత్తయ్య, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి సుమిత్రాదేవి, సహా అధ్యక్షురాలు హేమలత రోజా, శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

కేవీకే గోల్డెన్ జూబ్లీ వేడుకలు ప్రారంభం



వేడుకల్లో పాల్గొన్న కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు, యువత

గుంటూరు రూరల్: వ్యవసాయ విస్తరణ, పరిశోధన, విద్య రంగాలలో 50 ఏళ్ళుగా కృషి విజ్ఞాన కేంద్రాలు అందించిన సేవలు నిరుపమానమని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.యుగంధర్‌కుమార్ కొనియాడారు. మంగళవారం నగర శివారుల్లోని లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గోల్డెన్ జూబ్లీ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పద్ధతులను విప్లవాత్మకంగా మార్చటంలో, గ్రామీణ జీవనోపాధిని మెరుగు పరచటంలో, స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించటంలో కేవీకే సాధించిన విజయాలను వివరించారు. అనంతరం ఆదర్శ రైతులను, లబ్ధి పొందిన గ్రామీణ యువతను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఎం. గంగాదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.దీప, డాక్టర్ సీహెచ్ అనిల్‌కుమార్, డాక్టర్ ఆర్‌కే సౌజన్యలక్ష్మి, రైతులు, గ్రామీణ యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు.